

అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న ఆలయంలో అన్నదాన భవన నిర్మాణానికి చంద్రకాంత్, ప్రత్యూష దంపతులు (రాజమహేంద్రవరం) రూ.51,116 విరాళం అందజేశారు.



నిత్యాన్న దానానికి రూ.1,00,116

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పోతుల వీరవెంకట సత్యనారాయణ(తోటపేట) రూ.1,00,116 విరాళంగా అందజేశారు.

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 9.90 అడుగుల వద్ద నీటిమట్టం కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు


కవురు శ్రీనివాస్


రావిపాటి రామచంద్రరావు


తోట రామస్వామి

సాక్షిప్రతినిధి,కాకినాడ: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషిచేసేలా పార్టీ తరఫున నియోజకవర్గ పరిశీలకులు నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలను చేపట్టారు.

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గానికి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, రాజమహేంద్రవరం సిటీకి రావిపాటి రామచంద్రరావు, అనపర్తికి తోట రామస్వామిలను నియమించారు. కాగా, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా రంపచోడవరం నియోజకవర్గానికి మండపేటకు చెందిన కర్రి పాపారాయుడును నియమించారు.

ఈవీఎంల గోడౌన్ తనిఖీ



ఈఈఎం గౌడౌన్ తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఈవీఎంల గోడౌన్‌ను తనిఖీ చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత తెలిపారు. శుక్రవారం ఎఫ్‌సీఐ గోడౌన్‌లో ఈవీఎం భద్రపరచిన గోడౌన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ తనిఖీ చేశామన్నారు. పోలీసు భద్రతతో పాటు, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి, ఎస్‌డీసీ ఆర్.కృష్ణ నాయక్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.పవన్‌కుమార్ ఉన్నారు.

25 న గ్రూప్-2 పోస్టులకు పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ నరసింహులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఈ నెల 25వ తేదీన గ్రూప్ -2 పోస్టులకు సంబంధించిన రాత పరీక్షలు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాలో 53 పరీక్ష కేంద్రాలలో 18,501 మంది పరీక్షకు హాజరు అవుతున్నారన్నారు. పరీక్ష నిర్వహణకు 53 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 53 మంది మండల స్థాయి అధికారులను లైజన్ ఆఫీసర్లుగా, 18 మంది జిల్లా అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించామన్నారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఉదయం 9.30 నుంచి 10.15 గంటల వరకు అభ్యర్థులను అనుమతిస్తామని చెప్పారు. హాల్ టికెట్‌తో పాటుగా ఒక ఒరిజినల్ ఫొటోతో పాటు ఏదైనా గుర్తింపు కార్డు (పాస్ పోర్టు, పాన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, ప్రభుత్వ గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్) తో హాజరవ్వాలన్నారు.

27న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల గ్రీవెన్స్ డే

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె .నివాస్ ఆదేశాల మేరకు, ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ ఈట పద్మావతి సూచనల మేరకు జిల్లా పరిధిలో ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులలో ఎవరికైనా జీతాలకు సంబంధించిన సమస్యలుంటే గ్రీవెన్స్‌డే రోజున కలిసి స్వయంగా కలిసి వినతిపత్రం అందజేయాలన్నారు. జిల్లా స్థాయిలో అందిన వినతులన్నింటిని విజయవాడ గొల్లపూడిలోని ప్రజా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయ శాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపిస్తామని ఆయన తెలిపారు.

- ప్రభుత్వ పరిపాలన, సంక్షేమ పథకాలపై వక్తలు, ప్రజల ప్రశంసలు
- సర్కారు కృషి ఇలాగే కొనసాగాలని ఆకాంక్ష
- 'మహిళకు మహోదయం' అంశంపై 'సాక్షి' టీవీ ఆధ్వర్యంలో చర్చా వేదిక
- వివిధ వర్గాల మహిళల నుంచి అపూర్వ స్పందన



కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర హోంశాఖా మంత్రి తానేటి వనిత, మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎంపీ భరత్‌రామ్, మేడపాటి షర్మిలారెడ్డి, ఇతర ప్రముఖులు

మనసున్న పాలనలో మహిళాభ్యున్నతి

మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వక్తలు, ప్రజలు, ప్రశంసల వర్షం కురిపించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భేష్ అని మెచ్చుకున్నారు. రాజమహేంద్రవరం నగరంలోని బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్య మైదానంలో 'మహిళకు మహోదయం' అనే అంశంపై 'సాక్షి టీవీ' చానల్ ఆధ్వర్యంలో చర్చా వేదిక జరిగింది. కేఎస్ఆర్ లైవ్ షో వ్యాఖ్యాత, ప్రముఖ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు, యాంకర్ ఈశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన చర్చా వేదికలో వివిధ మహిళా సంఘాల నేతలు, విద్యార్థినులు, మహిళలు, వలంటీర్లు, రాజకీయ నాయకులు పాల్గొని 58 నెలల్లో ప్రభుత్వం అందించిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా మహిళలు సాధించిన అభివృద్ధిపై వివరించారు.

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం) /రాజమహేంద్రవరం రూరల్



హాజరైన మహిళలు

ఆకాశంలో, అవకాశాలలో సగం



మహిళలు ఆకాశంలో సగం, వారికి అవకాశాలలో సగం అన్నది నిజం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. ప్రస్తుతం అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ, మహిళలకు సంక్షేమ పథకాలు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్నదే. దీనికి ఉదాహరణ కేబినేట్‌లో నలుగురు మహిళలకు మంత్రి పదవులు దక్కడం. డ్వాక్రా మహిళలకు ఆసరా పథకంతో నాలుగు దఫాలుగా రుణమాఫీ, సున్నా వడ్డీకే రుణాలు ఇచ్చి అండగా నిలిచారు. 45 నుంచి 60 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు చేయూత పథకం ద్వారా అండగా నిలిచారు. ఈబీసీ నేస్తంతో అగ్రవర్ణ పేదలకు సైతం ఆర్థిక ఆసరా కల్పించారు. దీంతో చిన్న పరిశ్రమల ఏర్పాటు చేసుకుని పేదరికాన్ని తరిమేసి, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగారు. మహిళల రక్షణ కోసం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దిశ యాప్‌ను తీసుకువచ్చి రక్షణ, భద్రత కల్పిస్తున్నారు.

– తానేటి వనిత, రాష్ట్ర హోం మంత్రి

మహిళల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన సీఎం జగన్



చాలా రాజకీయ పార్టీలు ఆశయంతో వస్తాయి. ఆశపుట్టి పోతాయి. మహిళ మాత్రమే కుటుంబాన్ని చూసుకోగలదని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నామినేట్ పోస్టుల్లో, దేవదాయ కమిటీ, మార్కెటింగ్ కమిటీలు ఇలా మహిళాలకు 50 శాతం పోస్టులు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుంది. బీసీలకు 50 శాతం రాజకీయ ప్రాధాన్యం కల్పించారు. అమ్మ ఒడి ద్వారా బాల కార్మిక వ్యవస్థను రూపుమాపారు. మహిళల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా డీబీటీ ద్వారా వారి ఖాతాల్లోకి సొమ్ము జమ చేస్తున్నారు. మహిళ ఆరోగ్యం కోసం సంపూర్ణ ఆరోగ్య పోషణ కార్యక్రమం, రూ.25 లక్షలు విలువ చేసే వైద్యం అందించే ఆరోగ్య శ్రీ కార్డు లాంటి పథకాలు మహిళలకు భరోసా, భద్రత కల్పించాయి.

– చెల్లుబోయిన వేణు, మంత్రి

నాడు-నేడుతో పాఠశాలలకు మహర్దశ



నాడు –నేడు పేరుతో ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూల్స్‌గా మార్చిన ఘనత జగనన్నకే దక్కుతుంది. సామాన్య ప్రజలు అప్పు చేసి తమ పిల్లలను ప్రైవేట్ స్కూల్స్‌లో చదివించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు, ట్యాబ్‌ల పంపిణీ చేసి బైజూస్ వంటి టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చారు. మహిళలకు అమ్మ ఒడి పథకం ద్వారా అందుతున్న సహాయం ఎందరో విద్యార్థినులు చదువును కొనసాగించేందుకు ఉపయోగపడుతోంది.

– మార్గాని భరత్‌రామ్, ఎంపీ, రాజమహేంద్రవరం

ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి



విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన మార్పుల కారణంగా ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయి. జగన్న ప్రవేశ పెట్టిన విద్యాదీవెన, వసతి దీవెన, విద్యా కానుక వంటి పథకాలు పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరం. రూరల్ ఏరియాల్లో ఉన్న విద్యార్థులు ఇంజినీరింగ్ వైపు అంతగా ఆసక్తి చూపరు. ప్రస్తుత ప్రభుత్వంలో తీసుకువచ్చిన విద్య సంస్కరణలతో ఈ పరిస్థితి మారింది. ఇంజినీరింగ్‌తో పాటు డిగ్రీ విద్యలోను తీసుకువచ్చిన మార్పుల కారణంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. ఇలాంటి మార్పులు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– సత్య సౌందర్య, ప్రిన్సిపాల్, రాజమహేంద్రి మహిళా కళాశాల

మహిళలు లక్షాధికారులయ్యారు



జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అమ్మ ఒడి, డ్వాక్రా రుణమాఫీ, ఆసరా పథకాల ద్వారా మహిళలు లక్షాధికారులయ్యారనేది నగ్నసత్యం. ఒకప్పుడు పోపుల డబ్బాలో డబ్బు దాచుకునే స్థాయి నుంచి ఇప్పుడు బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము దాచుకునే స్థాయికి మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యారు. ఇళ్లు లేని పేదలకు దాదాపు రూ.32 లక్షల ఇళ్లు ఇచ్చి స్థిరాస్తి హక్కును కల్పించారు. 10,500 హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు, కరోనా కష్ట కాలంలో వలంటీర్ వ్యవస్థను సమర్థంగా ఉపయోగించి సేవలందించారు. జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసిన ఏకైక ప్రభుత్వం ఇది.

– డాక్టర్ అనసూరి పద్మలత, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షురాలు

సంక్షేమానికి పెద్ద పీట



జగనన్న ప్రభుత్వంలో ఆరోగ్య సురక్ష ద్వారా మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు కూడా ఇవ్వడం మరే రాష్ట్రంలో లేదు. ఎందరో తల్లులకు జగనన్న ఒక పెద్ద కొడుకుగా, మనవడిగా మారి వారి బాగోగులు చూస్తున్నారు. మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందజేసి వారి ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వాన్ని కొసాగించేందుకు మహిళలు నడుం బిగించాలి.

–మేడపాటి షర్మిలారెడ్డి, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్



దిశ చట్టంతో మరింత భద్రత



దిశ యాప్, చట్టంతో మహిళలకు మరింత భద్రత చేకూరింది. ముఖ్యంగా విద్యార్థినులు, ఉద్యోగాలు చేసే మహిళలకు దిశ యాప్ ఎంతో ఉపయోగపడుతోంది. మహిళల సంరక్షణ, భద్రత చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఇటాంటి చట్టాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం.

– పద్మావతి, మోటివేషనల్ స్పీకర్

దిశ యాప్‌తో ధైర్యం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన దిశాచట్టం విద్యార్థినులకు, మహిళలకు ఒక వరం. మొబైల్‌లో దిశయాప్ ఉండడం వలన రాత్రి సమయాల్లో ఇంటికి ఒంటరిగా వెళ్లినా.. తన వెంట ఒక నాన్న, అన్న ఉన్నంత ధైర్యంతో ముందుకు వెళుతున్నాం. దిశయాప్‌తో పలు సంక్షేమ పథకాల ద్వారా మహిళలు దశను సీఎం జగన్ మార్చారు.

– ఎం.ప్రశాంతి, డిగ్రీ ఫైనలియర్, రాజమహేంద్రి మహిళా కళాశాల

పాడి రైతులకు ప్రోత్సాహం

కలెక్టర్ మాధవీలత

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా అమూల్ ఆధ్వర్యంలో 86 సేకరణ కేంద్రాల ద్వారా పాలు సేకరిస్తున్నామని, మార్చి 1 నుంచి మరో 91 కొత్త కేంద్రాలను ప్రారంభించనున్నట్లు కలెక్టర్ కె.మాధవీలత ప్రకటించారు. శుక్రవారం మండలంలోని నందమూరులో జగనన్న పాల వెల్లువలో భాగంగా పాల సేకరణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పాల సేకరణలో దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల నుంచి సేకరించి మేలైన ధర చెల్లిస్తున్నామన్నారు. జిల్లాలో 44 కేంద్రాలుండగా, శుక్రవారం మరో 42 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. మార్చి ఒకటో తేదీ నుంచి రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో కొత్తగా 91 కేంద్రాలు ప్రారంభిస్తున్నామన్నారు. వీటిలో రాజానగరం మండలం భూపాలపట్నంలో ఒక బల్క్ మిల్క్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నామని దీని పరిధిలో 44 పాల సేకరణ కేంద్రాలుంటాయన్నారు.కోరుకొండ మండలం జంభుపట్నంలో మరో బల్క్ మిల్క్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని ,దీనిలో పరిధిలో మరో 45 కేంద్రాలు పని చేస్తాయన్నారు. గోపాలపురం మండలం చిక్కాలలో ఐదువేల లీటర్ల పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రోజుకి ఐదు వేల లీటర్ల పాటు సేకరిస్తున్నామని భవిష్యత్‌లో ఒక్కో కేంద్రం నుంచి రోజుకి 160 లీటర్ల పాలు సేకరణ లక్ష్యం సాధించే విధంగా ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎస్‌జీటీ సత్యగోవింద్, ఏడీ వెంకటరెడ్డి, సర్పంచ్ కంటిపూడి గంగాభవానీ, ఎంపీటీసీ సభ్యురాలు కె.నవ్యశ్రీ పాల్గొన్నారు.



నందమూరులో పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

ప్రజల ముంగిటకే పాలన

మంత్రి వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి నాలుగున్నరేళ్ల కాలంలో ప్రజల ముంగిటకే గ్రామపరిపాలన వ్యవస్థను తీసుకు వచ్చారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైఎస్సార్‌సీపీ రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని శాటిలైట్‌సిటీ గ్రామంలో రూ.2.30 కోట్లతో నిర్మించిన నాలుగు గ్రామ సచివాలయం భవనాలు, ఒక రైతు భరోసా కేంద్రం, ఒక వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాలను ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి తెలిపారు. సేవ చేయడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతానికి తనను కోఆర్డినేటర్‌గా నియమించారన్నారు. ప్రజల సమస్యలు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

స్వచ్ఛత.. మనందరి బాధ్యత

శాటిలైట్‌సిటీలో మంత్రి వేణు స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమంలో భాగంగా మెరుగైన శానిటేషన్ కోసం ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చీపురు పట్టి డ్రైనేజీలను శుభ్రం చేశారు. వైఎస్సార్ సీపీ వైద్యవిభాగ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉపసర్పంచ్ బొమ్ము శ్రీను, మాజీ ఎంపీటీసీ కాకరపల్లి అప్పారావు పాల్గొన్నారు.



శాటిలైట్‌సిటీ గ్రామ సచివాలయం-2 భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వేణు

నిబద్ధత పాటించాలి

కాకినాడ సిటీ: ఎన్నికల వార్తల ప్రచురణ, ప్రసారాల్లో ఎన్నికల కమిషన్ సూచించిన నిష్పాక్షికత, నిబద్ధతా సూచనలను పాటిస్తూ ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డి.నాగార్జున మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వివేకానంద హాలులో రానున్న ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల నిర్వహణ విభాగానికి అనుబంధంగా ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్, మోనిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మీడియా సెంటర్ అందించే సమాచార సేవలు, సదుపాయాలను నాగార్జున వివరించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా అందిస్తామని, ఎన్నికల వార్తల సేకరణ నిమిత్తం మీడియా ప్రతినిధులకు పోలింగ్, కౌంటింగ్ పాసులు కమిషన్ జారీ చేస్తుందని తెలిపారు. పెయిడ్ న్యూస్, ఫేక్ న్యూస్ పోకడలపై ఎన్నికల కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఎంసిఎంసీ సోషల్ మీడియా నిపుణులు ప్రొఫెసర్ జీవిఆర్ మూర్తి మాట్లాడుతూ బాధ్యతారహితమైన సోషల్ మీడియా వార్తల వల్ల ఎన్నికలలో కలిగే నష్టాలను, ఫేక్ వార్తలను గుర్తించే విధానం మీడియా ప్రతినిధులకు వివరించారు. కమిటీ సభ్యులు కుడా వైస్ చైర్మన్ పి.కృష్ణమూర్తి సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి, నోడల్ అధికారి డీఎల్‌డీవో పి.నారాయణమూర్తి, ప్రింట్, ఎల్క్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి నాగార్జున

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి
- సోషల్ మీడియా సమావేశంలో జెడ్పీ చైర్మన్ విప్పర్తి

పి.గన్నవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులు కృషి చేయాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. పి.గన్నవరం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని మండల, గ్రామ సచివాలయాల సోషల్ మీడియా కన్వీనర్లు, కో కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. సోషల్ మీడియా రూపొందించిన 'నిలువెత్తు నిజాయితీ–మన అభ్యర్థి విప్పర్తి' అనే లోగోను ఆవిష్కరించారు. జిల్లా సోషల్ మీడియా, జిల్లా జేసీఎస్ అధ్యక్షుడు పాటి శివకుమార్ మాట్లాడుతూ రానున్న 50 రోజుల పాటు సోషల్ మీడియా ప్రతినిధులు మరింత కష్టపడి పనిచేసి సీఎంగా జగన్‌ను, పి.గన్నవరం ఎమ్మెల్యేగా విప్పర్తి వేణుగోపాలరావును గెలిపించాలని సూచించారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సూరిశెట్టి బాబీ, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య కుమార్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు మిండగుదటి శిరీష్, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చిట్టూరి రాధ, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు కుడుపూడి రాము, మండల జేసీఎస్ కన్వీనర్లు దొమ్మేటి దుర్గారావు, పులిదిండి ప్రభాకర్, రాష్ట్ర నాయకుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, కొక్కిరి రవికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

క్లుప్తంగా

రెండు కార్లు ఢీకొని ఐదుగురికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం వన్నెపూడి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాంగ్ రూటులో వచ్చి ఒక కారును మరో కారు ఢీ కొట్టడంతో రెండు కార్లలోని ఐదుగురికి గాయాలయ్యాయి. గొల్లప్రోలు ఎస్సై బాలాజీ తెలిపిన వివరాల ప్రకారం.. గొల్లప్రోలుకు చెందిన మొయిళ్ల శ్రీనివాసరావు రైస్ మిల్లు వ్యాపారం చేస్తుంటాడు. మర్రి కృష్ణ అనే వ్యక్తి కలిసి శుక్రవారం ఉదయం వ్యాపారం పని మీద ఏలేశ్వరం వెళ్లి, తిరిగి గొల్లప్రోలు వస్తున్నారు. వన్నెపూడి సెంటర్‌కు వచ్చే సరికి విశాఖపట్నం వైపు నుంచి విజయవాడ వైపు వెళుతున్న ఒక కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, అతి వేగంగా వచ్చి శ్రీనివాసరావు కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు, మర్రి కృష్ణతో పాటు రెండో కారులో ఉన్న గుడాల లక్ష్మి, గుడాల రాజారావు, గుడాల శోభనకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు, హైవే మొబైల్ పోలీసులు ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై ఎస్సై బాలాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు మట్టి వాహనాల సీజ్

ఆలమూరు: మండలంలోని మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల లంక భూముల్లో మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఆరు వాహనాలను ఆలమూరు పోలీసులు సీజ్ చేశారు. స్థానిక ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. లంక భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి, రవాణా చేస్తున్నారనే పక్కా సమాచారంతో ఎస్సై నేతృత్వంలోని పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున దాడి చేశారు. ఈ సందర్భంగా మట్టిని తరలిస్తున్న రెండు లారీలు, నాలుగు ట్రాక్టర్లు పట్టుబడ్డాయి. వాటికి ఏ విధమైన మైనింగ్ బిల్లులు లేకపోవడంతో తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్సై శ్రీను నాయక్ స్థానిక తహసీల్దార్ కె.గోపాలకృష్ణకు సిఫారసు చేశారు. సీజ్ చేసిన వాహనాలను రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ పరిశీలించారు.

చిరుతిండి.. ప్రమాదమండి

- స్నాక్స్ రూపంలో కొన్ని నాసిరకం ఆహార పదార్థాల విక్రయం
- చిన్నారుల ఆరోగ్యానికి అపాయం



కాకినాడ సిటీ: కడుపులో నలుసు పడిందని తెలిసినప్పటి నుంచి కాబోయే అమ్మ జాగ్రత్త పడిపోతుంది. అతి తినాలి. ఇది తినకూడదంటూ బోలెడు జాగ్రత్తలు పాటిస్తుంది. బిడ్డకు రెండేళ్లు వచ్చే వరకూ కంటికి రెప్పలా కాపాడుతుంది. ఆ తర్వాత.. మూడేళ్ల బిడ్డ కాసింత ఏడిస్తే వాడి చేతిలో ఓ చిప్స్ ప్యాకెట్ పెడుతున్నారు. ఐదేళ్ల పాప స్కూల్‌కు వెళ్లనని మారాం చేస్తే ఏ కంపెనీదో తెలీదు స్నాక్ ప్యాకెట్ తాయిలం ఇచ్చేస్తున్నారు. మధ్యాహ్నం వేళ దాహమేస్తే నీళ్లు ఇవ్వాల్సింది పోయి డ్రింకు బాటిల్ చేతిలో పెట్టే వారూ ఉన్నారు. వీరంతా బిడ్డలకు కొనిస్తున్నది చిరుతిళ్లు కావు.. రోగాలు. ఏ పదార్థంతో తయారు చేశారో తెలియకుండా, అది శరీరానికి ఏం చేస్తుందో తెలుసుకోకుండా, బ్రాండ్ కూడా కనుక్కోకుండా పిల్లలకు పెడితే అది వారి ప్రాణాలకే ముప్పు తెచ్చి పెడుతుంది. అందుకే చిరుతిండి.. చాలా ప్రమాదమండి అని వైద్యులు కూడా చెబుతున్నారు.

పెరుగుతున్న కేసులు

జిల్లాలో ఇటీవల చిన్న పిల్లల వైద్యుల వద్ద కేసులు బాగా పెరుగుతున్నాయి. గ్యాస్ట్రిక్, కడుపు నొప్పి, వాంతులతో చాలామంది వైద్యుల వద్దకు వెళుతున్నారు. ఎందుకు పిల్లలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని పరిశీలిస్తే ఎక్కువగా రసాయనాలు, అధికంగా కారం, సాల్టు ఉన్న నాసిరకం చిరుతిండ్లు (స్నాక్స్) తినడం వల్లనేనని డాక్టర్లు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. దీన్ని సీరియస్‌గా తీసుకోకపోతే పిల్లల శారీరక పెరుగుదల మందగిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. బ్రాండెడ్ వాటి కంటే మెరుగ్గా ప్యాకింగ్ చేసి అందులో ఉన్న పదార్థాలను మాత్రం నాసిరకంగా తయారు చేస్తున్నారు. నూనె మొదలు మసాలాల వరకు అన్నీ కల్తీ వస్తువులనే ఉపయోగిస్తుండటంతో వాటిని తిన్న చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

జిల్లాలో పరిస్థితి

జిల్లాలోని 940 ప్రాథమిక, 431 ప్రాథమికోన్నత, 251 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో కలిపి 1,296 సర్కారు బడులు ఉన్నాయి. వీటిలో పాటు 1,613 ప్రైవేటు పాఠశాలలున్నాయి. వీటిలో 2,72,418 మంది విద్యార్థులు ఉన్నారు. వీరితో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 నుంచి 6 ఏళ్ల లోపు చిన్నారులు సుమారు 56,850 మంది ఉన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోని దుకాణాల్లో కొందరు ఈ స్నాక్స్ విక్రయిస్తున్నారు. బ్రాండెడ్ స్నాక్స్ కొనేవాళ్లు చాలా తక్కువ మందే ఉంటున్నారు. అలాగే నాసిరకం డ్రింక్ బాటిళ్లను అధిక శాతం మంది కొనుగోలు చేస్తూ ప్రాణాలకు ముప్పు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా పల్లెల్లో ఈ తరహా మోసాలు అధికంగా జరుగుతున్నాయి. కొందరు హోల్‌సేల్ వ్యాపారుల దగ్గర లోకల్ ప్యాకింగ్‌లతో నాసిరకంగా తయారైన చిరుతిండ్ల ప్యాకెట్లను తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

పెద్ద ఎత్తున వ్యాపారం

హైదరాబాద్, అనంతపురం, విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి నిత్యం చిరుతిండ్లు (స్నాక్స్) ప్యాకెట్లు జిల్లాకు దిగుమతి అవుతున్నాయి. ఇక్కడ హోల్‌సేల్ వ్యాపారులు జిల్లాలో ఉన్న దాదాపు 45 వేలకు పైగా దుకాణాలకు వీటిని విక్రయిస్తున్నారు. అంతేకాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు కూడా ఇలాంటి ప్యాకెట్లను ఇక్కడ విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ షాపుల్లో ప్రతి రోజూ సుమారు రూ. 50 లక్షల చొప్పున ఏడాదికి రూ.180 కోట్ల వరకు స్నాక్స్ వ్యాపారం జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇంతలా వ్యాపారం జరుగుతుండడంతో చిన్నపాటి కంపెనీలు కూడా పోటీపోటీగా ఆహార పదార్థాలను నాసిరకంగా తయారు చేస్తూ తక్కువ ధరలకు విక్రయిస్తున్నాయి. వీటిపై ఇటు ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు గానీ, అటు జీఎస్టీ అధికారులు గానీ తనిఖీలు చేపట్టకపోవడంతో వారి వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా నడుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాసిరకం ఆహార పదార్థాలు విక్రయించే వారిపై చర్యలు చేపట్టి చిన్నారులు ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

మీరూ పరిశీలించండి

పిల్లలు అడిగిన వెంటనే వారి అల్లరిని చూసి తినుబండారాలు (స్నాక్స్) కొంటున్న తల్లిదండ్రులు ఆ ప్యాకెట్లపై ఉన్న వివరాలను పరిశీలించాలని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ప్యాకెట్లపై ఐఎస్ఐ మార్క్, తయారీ తేదీ, బెస్ట్ బిఫోర్ తేదీలను చూడాలి. అలాగే ప్యాకెట్‌పై బ్యాచ్ నంబర్, కంపెనీ వివరాలు పక్కాగా ఉండాలి. ఇలాంటి వివరాలు లేకపోతే ఆ ప్యాకెట్లు కొనవద్దు. వెంటనే సమీపంలో ఉన్న రెవెన్యూ అధికారులకు లేదా ఫుడ్ కంట్రోల్ అధికారులకు సమాచారం ఇచ్చి నాసిరకం స్నాక్స్ అమ్మకాలను అరికట్టవచ్చునని అధికారులు చెబుతున్నారు.

ప్రమాదంలో చిన్నారుల ఆరోగ్యం



నాసిరకం తినుబండారాల అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అభం శుభం తెలియని చిన్నారులు ఆకర్షణీయంగా ఉన్న ఆ ప్యాకెట్లను కొనుక్కొని ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు చేసి నాసిరకం వస్తువులను అమ్మే వారిపై చర్యలు చేపట్టాలి.

– కె ప్రవీణ, ప్రాజెక్టు డైరెక్టర్, స్త్రీశిశుసంక్షేమశాఖ, కాకినాడ జిల్లా

అధికారులు చర్యలు తీసుకోవాలి



పాఠశాలలున్న చాలా వీధుల్లో చిరు దుకాణాల వద్ద నాసిరకం పదార్థాలను విక్రయిస్తున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లల మీద ప్రేమతో వాటిని కొనిఇస్తున్నారు. దీంతో పిల్లల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– జగదం శ్రీహరి, మార్కెటింగ్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు, తూరంగి

నాసిరకం ఆహారంతో ప్రమాదం



నాసిరకం చిరుతిండి వల్ల చిన్నారులు త్వరగా అనారోగ్యం పాలవుతారు. కడుపు నొప్పితో పాటు ఇన్‌ఫెక్షన్ల బారిన పడటం ఖాయం. ఒక్కోసారి ఫుడ్ పాయిజన్ జరిగి తీవ్ర స్థాయిలో అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉంది. తల్లిదండ్రులు నాసిరకం తినుబండారాలను కొనకూడదు.

– డాక్టర్ రత్నకుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, కాకినాడ

పోలీసుల అదుపులో దారి దోపిడీ ముఠా!

నల్లజర్ల: దారి దోపిడీ ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. భీమవరానికి చెందిన హోల్‌సేల్ నగల వ్యాపారి గార్లే బాలూ నాథూరామ్ బుధవారం సాయంత్రం జంగారెడ్డిగూడెంలో తన వ్యాపారం ముగించుకొని కొయ్యలగూడెం మీదుగా భీమవరం వెళుతుండగా, పోతవరం వద్ద ఇన్‌కంట్యాక్స్ అధికారులమంటూ ఐదుగురు వ్యక్తులు వేరే కారులో వచ్చి మూడున్నర కిలోల బంగారం, రూ.5 లక్షల నగదు దోపిడీ చేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ కేసు పూర్వాపరాలు విచారణ చేసిన కొవ్వూరు డీఎస్పీ చెంచు రామారావు గురువారం మధ్యాహ్నం రెండు పోలీసు బృందాలను నియమించారు. ఇందులో ఒక బృందానికి దేవరపల్లి ఎస్సై శ్రీహరి నాయకత్వం వహిస్తున్నారు. రంగంలోకి దిగిన ఈ బృందాలు సీసీ ఫుటేజ్, టవర్ డంపింగ్‌ల ఆధారంగా జంగారెడ్డిగూడేనికి చెందిన ఏడుగురిని అదుపులోకి తీసుకుని రాజమహేంద్రవరం సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో విచారణ చేస్తున్నట్టు సమాచారం. ఈ విషయంపై డీఎస్పీ చెంచు రామారావును వివరణ కోరగా అనుమానితులను అదుపులోకి తీసుకున్న మాట వాస్తవమేనన్నారు. విచారణ పూర్తయ్యాక అన్ని విషయాలు వెల్లడిస్తామని తెలిపారు.

టి.రాయవరంలో కిడ్నాప్ గ్యాంగ్ కలకలం

ప్రత్తిపాడు: పిల్లలను కిడ్నాప్ చేసే గ్యాంగ్ వచ్చిందంటూ మండలంలోని టి.రాయవరంలో శుక్రవారం కలకలం రేగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని దళితవాడకు మాస్కులు ధరించిన నలుగురు వ్యక్తులు బూడిద రంగు కారులో వచ్చారు. చిన్న పిల్లలు ఆడుకుంటున్న ప్రదేశంలో తిరిగారు. పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు ఇవ్వచూపారు. అయితే పిల్లలు వాటిని తీసుకోకుండా, ఈ విషయాన్ని వారి తల్లులకు చెప్పారు. దీంతో మహిళలందరూ కలిసి ఆ నలుగురు వ్యక్తులను ఆపి ప్రశ్నించారు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పి, వచ్చిన కారులోనే ఏలూరు గ్రామం వైపు వెళ్లిపోయారు. కానీ ఆ కారు నంబరు ప్లేట్‌పై ప్లాస్టర్ అతికించి ఉండడంతో గ్రామ సర్పంచ్ తటవర్తి సుబ్బారావు పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై పెదబ్బాయి, సిబ్బంది కలిసి టి.రాయవరం, ఏలూరు గ్రామాల్లో విచారణ చేపట్టారు.

మేకల మందపై పెద్దపులి దాడి

- గాండ్రింపులకు పరుగులు పెట్టిన రైతు
- కరగపాడు ప్రాంతంలోనే పెద్దపులి మకాం
- రిజర్వ్ ఫారెస్ట్‌లో ట్రాప్ కెమెరాల ఏర్పాటు

దేవరపల్లి: గోపాలపురం మండలం కరగపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లోని మేకల మందపై శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో పెద్దపులి దాడి చేసి మందలోని రెండు మేకలను ఎత్తుకు పోయి చంపేసింది. ఆ సమయంలో మేకల మంద వద్ద ఉన్న కరగపాడు పంచాయతీ శివారు బుచ్చియపాలేనికి చెందిన యజమాని బొమ్మిన బాబూరావు భయంతో గ్రామానికి పరుగులు తీశాడు. విషయాన్ని గ్రామస్తులకు చెప్పడంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రాజమహేంద్రవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎల్.ధనరాజు ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది రిజర్వ్ ఫారెస్ట్‌కు చేరుకుని పెద్దపులి దాడిలో చనిపోయిన రెండు మేకలను పరిశీలించారు.


గోపాలపురం మండలం కరగపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో అధికారులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరా

కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నాం

పెద్దపులి కదలికలను నిశితంగా పరిశీలన చేస్తున్నామని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎల్.ధనరాజు తెలిపారు. గురువారం సాయంత్రం పెద్దపులి తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామ సమీపంలో ఉందని అంచనా వేయగా, అక్కడ నుంచి చిట్యాల, పెద్దాపురం, వేళ్ల చింతలగూడెం, బంధుపురం, గొల్లగూడెం, మాతగమ్మమెట్ట, నందిగూడెం మీదుగా కరగపాడు అటవీ ప్రాంతానికి చేరుకుందన్నారు. పొగాకు తోటల్లో ఆకు రెలుపులకు వెళ్లే రైతులు, కూలీలు అతి జాగ్రత్తగా ఉండాలని, అవసరం అయితే పొగాకు రెలుపులు మానుకోవాలని ఆయన సూచించారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో సంచరిస్తున్న పులి ఒక్కటేనని, రెండు, మూడు కాదన్నారు. అది త్వరలో పాపికొండల అభయారణ్యంలోకి చేరవచ్చునని అంచనా వేస్తున్నామన్నారు.

సురక్షిత ప్రాంతానికి తరలించాలి

దేవరపల్లి: పలు గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న పెద్దపులిని త్వరితగతిన పట్టుకుని సురక్షిత ప్రాంతానికి తరలించాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత అధికారులను ఆదేశించారు. గోపాలపురం మండలం కరగపాడు అటవీ ప్రాంతంలో మేకల మందపై దాడి చేసి రెండు మేకలను చంపిన ఘటనపై మంత్రి స్పందించారు. వెంటనే కలెక్టర్ కె.మాధవీలతతో మాట్లాడి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్



ప్రకాశంనగర్: పవిత్ర రంజాన్ మాసంలో ప్రభుత్వ ముస్లిం ఉద్యోగులు తమ విధుల నుంచి ఒక గంట ముందు వెళ్లేందుకు వెసులుబాటు కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మహమ్మద్ ఆరిఫ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఈ మేరకు స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మార్చి 11 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకూ ముస్లిం ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ఇది వర్తిస్తుందన్నారు.

నరసన్న గ్రామోత్సవం.. కనుల వైభవం

- రాజాధిరాజ, అశ్వవాహనాలపై ఊరేగిన స్వామివారు
- తరలివచ్చిన భక్తులు


రాజాధిరాజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థమహోత్సవాల్లో ఎనిమిదో రోజు శుక్రవారం సాయంత్రం రాజాధిరాజ వాహనంపైనా, రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపైనా స్వామివారి గ్రామోత్సవాలను అర్చకులు నిర్వహించారు. అంతకు ముందు ఆలయం నుంచి పల్లకిలో స్వామి, అమ్మవార్లను అలంకార మండపానికి అర్చకులు, భక్తులు తోడ్కొని వచ్చారు. అలంకార మండపంలో పూలతో స్వామిని అలంకరించారు. వాహనాల వద్ద ప్రముఖులు, అర్చకులు కొబ్బరికాయలు కొట్టి గ్రామోత్సవాలకు శ్రీకారం చుట్టారు. మాడ వీధుల్లో వాహనాలపై స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అరటిపండ్లు, కొబ్బరి కాయలు నైవేద్యాలుగా సమర్పించుకున్నారు.

అలరించిన చోర సంవాదం ఘట్టం

రాత్రి 8 గంటలకు 16 స్తంభాల మండపం వద్ద అర్చకులు నిర్వహించిన చోరసంవాదం ఘట్టం భక్తులను ఎంతగానో అలరించింది. దారిదోపిడి దొంగగా మారిన పరకాలుడిని స్వామి తిరుమంగయాళ్వార్‌గా మార్చి, మంచి జీవితాన్ని ప్రసాదించిన ఘట్టాన్ని ఇతివృత్తంగా చేసుకుని అర్చకులు నిర్వహించేదే చోర సంవాదం ఘట్టం. కల్యాణోత్సవాల్లో ఏటా మాదిరే ఎనిమిదో రోజు శుక్రవారం రాత్రి 8 గంటలకు గ్రామంలోని 16 స్తంభాల మండపం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ప్రేమించిన యువతిని పెళ్లాడేందుకు తిరుమంగయాళ్వార్ (పరకాలుడు) దారి దోపిడీ దొంగగా మారడం, స్వామి సాక్షాత్కరించి అతడిలో పరివర్తన తేవడాన్ని కళ్లకు కట్టిస్తూ సాగేదే చోర సంవాదం ఘట్టం సారాంశం.

అంతర్వేదిలో నేడు

శనివారం తొమ్మిదో రోజు మాఘ పౌర్ణమి సందర్భంగా స్వామివారి చక్రవారి అవభృథోత్సవం, సముద్ర స్నానం నిర్వహిస్తున్నట్టు ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ తెలిపారు. ఉదయం 3 నుంచి 6 గంటల వరకూ సుప్రభాతసేవ, శ్రీస్వామివారి తిరువారాధన, బాలభోగం, వార్షిక అభిషేకాలు, సాధారణ, ప్రత్యేక దర్శనాలు ఉంటాయన్నారు. ఉదయం 8 గంటలకు గరుడ పుష్పక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, రాత్రి ధ్వజ అవరోహణ నిర్వహిస్తామన్నారు.

వైభవంగా కుంతీమాధవస్వామి రథోత్సవం


స్వామిని దర్శించుకుంటున్న కాకినాడ ఎంపీ వంగా గీత


విద్యుత్ వెలుగుల్లో కుంతీమాధవ స్వామి వారి రథం


ద్రాక్షారామలో భీమేశ్వరస్వామి రథోత్సవం (అంతరచిత్రం) రథంపై ఊరేగుతున్న కల్యాణ మూర్తులు

పిఠాపురం: కుంతీమాధవస్వామి వారి దివ్య రథోత్సవం శుక్రవారం రాత్రి కనుల వైభవంగా జరిగింది. ఉదయం పిఠాపురం మహారాజా రాజారావు వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దూర్ పేరున అర్చకులు తొలి అర్చన చేశారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్త జనసందోహం నడుమ కుంతీమాధవస్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో అర్చకులు చక్రవర్తుల నరసింహాచార్యులు, చక్రవర్తుల మాధవాచార్యులు యాజ్ఞికంలో వేదమంత్రాల నడుమ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను అలంకరించారు. అనంతరం రాత్రి విచిత్ర వేషాలు, తప్పెటగుళ్లు, బ్యాండు మేళాల నడుమ విద్యుద్దీపాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి, రథోత్సవాన్ని కాకినాడ ఎంపీ వంగా గీత ప్రారంభించారు. ఆలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ఉప్పాడ సెంటర్ వరకు కొనసాగింది. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన రథయాత్ర తెల్లవారుజామున 2 గంటల వరకూ కొనసాగనుంది. ఉప్పాడ సెంటర్లో బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ఈఓ శ్రీరాములు, ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు..

ఉప్పాడ తీర్థానికి దొంగ దేవుడు

రథోత్సవం అనంతరం స్వామివారిని ప్రత్యేక రథంపై (శనివారం తెల్లవారుజామున) ఉప్పాడ సముద్ర తీరానికి చక్రస్నానం కోసం తీసుకెళ్లారు. అనంతరం భక్తులు మాఘ పౌర్ణమి పుణ్య స్నానాలు ఆచరించారు. రథోత్సవం తర్వాత చీకటిలో తీసుకువెళ్లడం వల్ల స్వామిని దొంగ దేవుడు అని పిలుస్తారు.

వైభవంగా భీమేశ్వరస్వామి రథోత్సవం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలోని మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం స్వామివార్ల కల్యాణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి, క్షేత్ర పాలకులైన లక్ష్మీ సమేత నారాయణస్వామి, చండికా సమేత సూరేశ్వరస్వామివార్ల కల్యాణ మూర్తులను పుష్పాలతో అలంకరించిన రథంపై అధిష్టింపజేశారు. దూపసేవ అనంతరం రథాంగబలి సమర్పించారు. సుముహూర్త సమయానికి ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు.ఆలయం నుంచి సూర్యావీధి, వెలంపాలెం, చంద్రా వీధి, ప్రధాన రహదారి, యానాం సెంటర్ మీదుగా వేగాయమ్మపేటలోని ఆస్థాన పూజా మండపం వరకూ కొనసాగింది.

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్ ప్రయాణం

కాకినాడ: పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకూ జరిగే పరీక్షలకు సంబంధించి పరీక్ష రాసే విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను చూపించి, ఇంటి నుంచి పరీక్షా కేంద్రానికి, ఆ తర్వాత తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

28 నుంచి రైల్వే గేటు మూసివేత

సామర్లకోట: సామర్లకోట – కాకినాడ రోడ్డులోని ఎల్‌సీ 426 రైల్వే గేటును ఈనెల 28 నుంచి మార్చి ఆరో తేదీ వరకూ మూసివేస్తామని రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ బి.రామసుబ్బారావు తెలిపారు. ఆయన శుక్రవారం సాయంత్రం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రైల్వే గేటు పరిధిలో ట్రాక్ మరమ్మతుల కారణంగా గేటు మీదుగా రాకపోకలు నిషేధించామన్నారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్, పోలీసు, రెవెన్యూ అధికారులకు, లారీ, ఆటో యూనియన్ నాయకులకు సమాచా రం ఇచ్చామన్నారు. ప్రయాణికులు, రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. సమావేశంలో స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో రైల్వే ప్రయాణికురాలు

- తక్షణమే స్పందించిన రైల్వే పోలీసులు
- సామర్లకోటలో వైద్యం అందించి కాపాడిన వైనం


అపస్మారక స్థితిలో ఉన్న కృష్ణవేణి

సామర్లకోట: రైలులో ప్రయాణిస్తున్న ఓ మహిళ అపస్మారక స్థితికి చేరడంతో రైల్వే పోలీసులు వెంటనే స్పందించారు. రైల్వే డాక్టర్ సాయంతో ఆమెకు చికిత్స చేయించి కాపాడారు. జీఆర్పీ ఎస్సై బి లోవరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ వెళుతున్న స్పెషల్ ట్రైన్ 08580లో ప్రయాణిస్తున్న విజయనగరానికి చెందిన కృష్ణవేణి అపస్మారక స్థితిలో ఉన్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం రైల్వే పోలీసులు అప్రమత్తం అయ్యారు. రైల్వే టీటీ నుంచి సామర్లకోట రైల్వే సూపరింటెండ్ అనంతలక్ష్మికి ఈ సమాచారం వచ్చింది. ఆమె వెంటనే రైల్వే పోలీసులకు తెలియజేశారు. ఆ రైలు సామర్లకోట వచ్చిన వెంటనే ఆమెను కిందకు దింపారు. పల్స్ పడిపోయి, హార్ట్‌బీట్ తగ్గిపోవడంతో రైల్వే డాక్టర్ ద్వారా ప్రాథమిక చికిత్స చేయించారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడకు పంపించారు. సకాలంలో స్పందించిన రైల్వే పోలీసులకు ప్రయాణికులు, బాధితురాలి భర్త కృతజ్ఞతలు తెలిపారు.